ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబర్ 2025 8 పేజీలు




గుంటూరు పల్నాడు

వాడీవేడిగా గుంటూరు కౌన్సిల్

18 గ్రామాల విలీనంకు ఆమోదం - నిర్బంధ భూసేకరణకు పచ్చజెండా - పలు అంశాలపై పరస్పర సవాళ్లు




సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. సమావేశానికి మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షత వహించారు. నగరపాలక సంస్థలో 18 గ్రామాల విలీనం, శంకర్ విలాస్ బ్రిడ్జికి నిర్బంధ భూసేకరణకు అనుమతిస్తూ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసింది. ఈ రెండు అంశాలపై జరిగిన చర్చలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. తొలుత విలీన గ్రామాల అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా తీర్మానం పెట్టడటం సబబు కాదని వైసిపి అభ్యంతరం వ్యక్తం చేసింది. గ్రామసభలు జరిగాయని, పంచాయతీల తీర్మానం జరిగిందని పలువురు టిడిపి సభ్యులు పరస్పర విరుద్ధంగా మాట్లాడారు. అయితే గ్రామసభలు నిర్వహించడం కార్పొరేషన్‌కు అధికారం లేదని కౌన్సిల్ నుంచి తీర్మానం మునిసిపల్ పరిపాలన శాఖకు చేరితే వారు పంచాయతీరాజ్‌కు పంపుతారని ఎమ్మెల్యే బి.రామాంజనేయులు తెలిపారు. గ్రామాలు విలీనమైతే కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవచ్చని, గ్రామాల్లోని 13 వేల ఎకరాల భూములు కార్పొరేషన్‌కు ల్యాండ్ బ్యాంకుగా మారతాయని అన్నారు. వివిధ అవసరాల నిమిత్తం 3600 ఎకరాలు అందుబాటులో ఉందన్నారు.

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు మాట్లాడుతూ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, గ్రామసభలు పెట్టకుండా తీర్మానం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అశాస్త్రీయంగా గుంటూరు గ్రామాల విలీనానికి తాము వ్యతిరేకమన్నారు. అయితే గ్రామసభలు జరిగాయని టిడిపి సభ్యులు బాలజీ చెప్పడం గమనార్హం. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఈ అంశంలో మేయర్ ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని తొందరపాటు పనికిరాదని సూచించారు. గ్రామాలకు సంబంధించిన ఎమ్మెల్యే లందరినీ కూర్చొబెట్టి మాట్లాడాలని కోరగా తాను ముగ్గురు ఎమ్మెల్యేలతో మాట్లాడానని మేయర్ బదులిచ్చారు. అయితే ఎమ్మెల్యేలు గళ్లా మాధవి రాలేదని, నశీర్ వచ్చి వెళ్లిపోయారని చంద్రగిరి ఏసురత్నం అన్నారు. టిడిపి కార్పొరేటర్ వేముల పల్లి శ్రీరాం ప్రసాద్ మాట్లాడుతూ పరిసర గ్రామాల విలీనానికి ఎమ్మెల్యేల అనుమతి, గ్రామాల తీర్మానాలు కూడా అవసరం అన్నారు. ఇప్పటికే నగరంలో చాలా ప్రాంతాలకు తాగునీరు రావడం లేదన్నారు. తన డివిజన్‌లో తాగునీటి సమస్య ఉందన్నారు. 42 డివిజన్‌లో తాగునీటి సమస్య లేదని ఎక్కడ ఉందో చూపాలని శ్రీరాం ప్రసాద్‌ను మేయర్ సవాల్ చేశారు. తాను రేపు వస్తాను సమస్య ఎక్కడ ఉందో చూపాలన్నారు. రండి చూపిస్తానని శ్రీరాం ప్రసాద్ ప్రతి సవాల్ చేశారు. గ్రామాల విలీనం వల్ల ఆయా గ్రామాల్లో కూడా అనేక సమస్యలు పరిష్కారం కావని, కొన్ని గ్రామాల్లో బోర్లు వేసినా నీరు రాదని, కప్పలు వస్తాయని శ్రీరాం ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఏ గ్రామంలో బోరు వేస్తే నీరు రాదో చూపాలని సవాల్ చేశారు.

తీర్మానాన్ని కార్పొరేటర్లు సాంబిరెడ్డి, స్మిత పద్మజ, బాలజీ సమర్థించగా పలువురు టిడిపి కార్పొరేటర్లు మౌనంగా ఉన్నారు. విలీనం గ్రామాలకు సంబంధించి పరిపాలన పరమైన సమస్యలు రాకుండా చూడాలన్నారు. దీని వల్ల ఎవరో కోర్టుకు వెళ్లి కార్పొరేషన్‌కు జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయించే అవకాశం ఉందని, గతంలో అలాగే జరిగిందని చెప్పారు. రూరల్ మండలంలోని 11 గ్రామాలతోపాటు తాజాగా పెదకాకాని మండలంలో తక్కెళ్ళపాడు, వెనిగండ్ల, అగవతరప్పాడు, పెదకాకాని, వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, పుల్లడిగుంట, తాడికొండ మండలం లాం గ్రామం కార్పొరేషన్‌లో విలీనానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూ తీర్మానం ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. సమావేశానికి హాజరవ్వని ఎమ్మెల్యే గళ్లా మాధవి విలీన గ్రామాల్లో పెదకాకాని కూడా కలపాలని కోరారని కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు చెప్పగా ఆ గ్రామాన్ని కూడా కలుపుతున్నట్టు మేయర్ ప్రకటించడం గమనార్హం. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కూడా సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నశీర్ కోరారు.

శంకర్ విలాస్‌పై గరం..గరం...

శంకర్ విలాస్ బ్రిడ్జికి అవసరమైన భూ సేకరణకు సంబంధించి వైసిపి సభ్యుడు అచ్చాల వెంకటరెడ్డి వేసిన ప్రశ్నపై చర్చ పెద్ద దుమారానికి దారితీసింది. టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. బ్రిడ్జి నిర్మాణానికి ముందు చేయాల్సిన ప్రాథమిక కర్తవ్యాలు చేయలేదని వైసిపి కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ప్రధానంగా మొత్తం అవసరమైన 120 అడుగుల వెడల్పు, 920 మీటర్ల పొడవుతో కూడిన భూమి ▶ 2లో



ఎర్రబాలెంలో ప్రచార జాతాలో మాట్లాడుతున్న సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు

లేబర్ కోడ్‌లను రద్దు చేసేదాకా పోరాటం

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదం కోసం ప్రచార జాతాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, మంగళగిరి రూరల్

విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి వచ్చే నెల 4 వరకు జరిగే సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, రాష్ట్ర నాయకులు గుంటూరు విజయ్‌కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మహాసభల జయప్రదం కోసం పల్నాడు జిల్లాలో రెండోరోజైన శనివారం పలు మండలాల్లో ప్రచార జాతాలు నిర్వహించారు. గురజాల, దాచేపల్లి, రెంటచింతల, పిడుగురాళ్ల, రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరులో జాతా అనంతరం సత్తెనపల్లిలో ముగింపు సభ జరిగింది. ఆయా ప్రాంతాలలో ప్రచార జాతాకు వివిధ సంఘాలు, పలు రంగాల కార్మికులు ఘన స్వాగతం పలికారు. ఆంజనేయులు నాయక్, విజయ్‌కుమార్, టి.శ్రీనివాసరావు మాట్లాడారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రబాలెంలో ప్రచార జాతాను బి.లక్ష్మణరావు ప్రారంభించగా ఎమ్‌టిఎంసి కార్మికులు ఘనస్వాగతం పలికారు. ఈ సదర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి కార్మికవర్గం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు దుర్మార్గమైన 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని చెప్పారు. వీటిద్వారా కార్మికుల్ని బానిసలుగా చేయబూనుకున్నారని మండిపడ్డారు. ధరల పెరుగుదల ఆకాశాన్ని అంటుతున్నా జీతాలు పాతళంలో ఉన్నాయని, మరోవైపున అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ల ఆస్తులు వంద రెట్లు అమాంతంగా పెరుగు ▶ 2లో



పల్నాడు జిల్లా జాతాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, కార్మికులు

మాదక ద్రవ్యాలపై నిరంతరం నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా, విక్రయదారులపై నిరంతరం నిఘా ఉంటుందని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ అన్నారు. స్థానిక స్వర్ణ భారతి నగర్‌లో పోలీసులు శనివారం నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌ను పరిశీలించిన ఎస్పీ మాట్లాడుతూ జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు, వ్యక్తుల వివరాలను పరిశీలించారు. గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలు, వ్యక్తిగత జీవితం, కుటుంబాలపై దాని ప్రభావం, చట్టపరంగా ఎదురయ్యే పరిణామాలను వివరించారు. రౌడీ షీటర్లను, సస్పెక్ట్ షీటర్లను, గంజాయి అమ్మేవారిని పిలిపించి, వారి జీవన విధానం, వారు చేస్తున్న పనులు, వారి ప్రవర్తన,



స్వర్ణభారతి నగర్ కార్డెన్‌సెర్చ్‌లో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్


వారివల్ల ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అని స్థానిక ప్రజల నుండి ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని రౌడీ షీటర్లను హెచ్చరించారు. స్థానికంగా కొంతమంది గంజాయి తాగుతున్నారనే సమాచారం ఉందని, అలాంటి ▶ 2లో

రైతుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి : సిపిఎం

రాజధానికి రెండవ దశ భూ సమీకరణకు స్వస్తి పలకాలని డిమాండ్ - మందడం రైతు రామారావుకు నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రభుత్వం రెండవ దశ భూ సమీకరణకు స్వస్తి పలకాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. ఎన్ 8 రోడ్డు నిర్మాణంపై మందడంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడిన అనంతరం రైతు దొండపాటి రామారావు మృతిచెందిన నేపథ్యంలో ఆయన భౌతికాకాయాన్ని బాబూరావుతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి సందర్శించి నివాళులర్పించారు. రామారావు కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మంత్రి నారాయణ సమక్షంలో జరిగిన సమావేశంలో రైతు రామారావు మృతి చెందారని గుర్తు చేశారు. రాజధాని నిర్మాణంలో భూములతో పాటు ఇళ్లు కూడా పోతున్నాయన్న ఆవేదన ఒక్క రామారావులోనే కాదని, రైతులందరిలోనూ ఉందని అన్నారు. రామారావు ఆవేదనకు, బాధకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రామరావు మరణంతోనైనా ప్రభుత్వ ఆలోచనా విధానం మారాలని, రైతులు,ప్రజలతో చర్చించి హామీల అమలుకు ▶ 2లో



రామారావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న బాబూరావు, నేతాజి, ఎం.రవి తదితరులు



ఫిబ్రవరిలో నరసరావుపేటలకే కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఎన్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సభ ఏర్పాటు కోసం పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల శనివారం పరిశీలించారు.

భూముల రీసర్వే పై గ్రామ సభలు

ప్రజాశక్తి - దుర్గి : భూముల రీసర్వేపై కూటమి ప్రభుత్వం కీలక మార్గ దర్శకాలను సూచిందని తహశీల్దార్ జి.కరుణకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాలుగా ఉన్న సరిహద్దు వివాదాల సమస్యలను పరిష్కరించి కచ్చితమైన భూ రికార్డులను సృష్టించడం కోసం భూ సర్వేను డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా దుర్గి మండలంలో మూడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని, భూ రీసర్వేను సర్వేయర్, వీఆర్వోలు చేపడతారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కోలగుట్ల గ్రామంలో, మంగళవారం ఉదయం ఆత్మకూరు గ్రామంలో, మధ్యాహ్నం పోలేపల్లి గ్రామంలో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. సర్వే సమయంలో భూ యజమానులు తప్పక హాజరుకావాలని సూచించారు.

జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందుకున్న శేషారావు

ప్రజాశక్తి-పెదకూరపాడు: జాతీయస్థాయిలో ఉత్తమ ప్రకృతి రైతు అవార్డును కేంద్ర ప్రభుత్వ విభాగం ఆర్‌సిఒఎస్ఎఫ్ పెదకూరపాడుకు చెందిన దర్శి శేషారావుకు గుంటూరులో శనివారం ప్రదానం చేసింది. ఆర్‌సిఒఎస్ఎఫ్ డైరెక్టర్ డాక్టర్ అజయ్ సింగ్ రాజ్ పుట్ నుండి అవార్డును శేషారావు అందుకున్నారు.





వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నూరు: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 4వ అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు శనివారం పాత పొన్నూరులోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కమిషనర్ రమేష్ బాబు, పట్టణ ఎస్ఐ లక్ష్మీ శనివారం ప్రారంభించారు. ఈ పోటీలు మూడ్రోజులపాటు జరగనున్నాయి.

ఉర్దూభాషపై వ్యాసరచనలో విజేతలకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఏర్పాటై 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సురూర్ బిఐబి ఉర్దూ మహోత్సవంలో భాగంగా గుంటూరు, చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన, ఉర్దూ లిపి పోటీల్లో విజేతలకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి ఎమ్‌డి ఖాసీం, పాఠశాల హెచ్ఎం వి.పద్మజ మాట్లాడుతూ ఉర్దూ భాషకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఉర్దూ చదివిన విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారని అన్నారు. పలుచోట్ల కంప్యూటర్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్.అక్బర్, షేక్.రఫీ నయీమ్ పాల్గొన్నారు.



కాలుష్యం నుంచి కురగల్లు గ్రామాన్ని కాపాడండి



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ కన్స్ట్రక్షన్ కంపెనీల ప్రతినిధులతో సిఆర్‌డిఏ శనివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పలువురు గ్రామస్తులు గ్రామంలో విపరీతమైన ట్రాఫిక్‌ను, దాని ద్వారా వచ్చే దుమ్ము ధూళి నుంచి గ్రామాన్ని పరిరక్షించాలని కోరారు. రాజధాని పరిధిలో వివిధ కన్స్ట్రక్షన్ కంపెనీల ప్రతినిధులు, సిఆర్‌డిఏ పరిధిలోని ఎన్విరాన్మెంట్ డిపార్ట్మెంట్ వారు ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సులో కురగల్లు గ్రామస్తులు పాల్గొన్నారు. పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ ధూళిపాళ్ల శేఖర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బందితో గ్రామానికి వచ్చే ట్రాఫిక్కు మళ్లింపు విషయమై వివరించారు. రోడ్డు మీద ఉన్న ధూళి లేవకుండా వాటరింగ్ చేయించాలని కోరారు. నిరుద్యోగ యువతకు కన్స్ట్రక్షన్ కాంపెనీలో ఉపాధి కల్పించాలని కోరగా కన్స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు. ట్రాఫిక్ వల్ల ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని, పంచాయతీలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కోరారు. పంచాయతీ పరిధిలోని మురుగంత చేరుతున్న చెరువులోకి ఆ మురుగునీరు మళ్లింపు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చూడాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ అన్ని కన్స్ట్రక్షన్ కంపెనీస్ నుంచి ఒక కో-ఆర్డినేషన్ ఏర్పాటు చేసుకుని వాట్సాప్ గ్రూప్ ద్వారా సమస్యల పరిష్కారానికి ఏర్పాట్లు గురించి వివరించారు.

వివిధ శాఖల అధికారులతో న్యాయాధికారి సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: వివిధ శాఖల అధికారులతో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయస్థాన భవనాల ఆవరణలో న్యాయాధికారి ఎన్.లావణ్య సమీక్షించారు. విద్యా సంవత్సరంలో వెనుకబడిన పిల్లలు, వైద్యం అందని చిన్నారులకు సరైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన పిల్లలకు న్యాయ సహాయం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సమావేశాలు నిర్వహించడం, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిషేధ చట్టంపై పట్టణంలోని ఇస్లాంపేట సచివాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు.



ఘనంగా జూలకల్ల పాఠశాల వజ్రోత్సవం

ప్రజాశక్తి పిడుగురాళ్ల : పల్నాడు ప్రాంతంలో యాక్షన్ గోడవలు పోయి పల్నాడు ప్రాంత అభివృద్ధి జరగాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని జూలకల్లు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. సీనియర్ ఉపాధ్యాయులకు సన్మానించారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు



ప్రయివేటు బస్సుల యజమానులతో మాట్లాడుతున్న డిటిఓ జి.సంజీవ్ కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రయివేటు ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా రవాణా శాఖ అధికారి జి.సంజీవ్ కుమార్ అన్నారు. నరసరావుపేటలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో శనివారం ప్రయివేటు ట్రావెల్స్ యజమానులతో సమావేశమయ్యారు. ఇటీవల పలు ప్రాంతాలలో వాటిల్లిన బస్సు ప్రమాదాలపై చర్చించి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించి నిబంధనలు పాటించాలని చెప్పారు. సంక్రాంతి పండుగ సీజన్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారి ఎస్.శివనాగేశ్వరరావు, సహాయ మోటార్ తనిఖీ అధికారులు ఎం.నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఆర్‌విఐటిలో అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు : స్థానిక ఆర్ వి ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తెనాలి డిఎస్పి జనార్ధన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థినీ విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగంపై పెద్ద ఎత్తున యుద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యువత క్షణికానందం కోసం, మాదకద్రవ్యాల వైపు వెళ్లి జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని సూచించారు. మీ నివాస పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మాదిగ ద్రవ్యాలు వాడినట్లు గాని అమ్మినట్లు గాని గుర్తించిన వెంటనే పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజం కొరకు , విద్యార్థినీ విద్యార్థులు యోధుల్లా పనిచేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్ వి కష్ణయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సమాజం మరియు కుటుంబాలను నిర్వీర్యం చేస్తాయని అన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రైతుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

ఉపక్రమించాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో కూడా రైతుల కష్టాలు కొనసాగుతున్నాయన్నారు. మొదటి దశ భూములు తీసుకొని మూడేళ్లలో అభివృద్ధి చేస్తామని చెప్పి 12 ఏళ్లయినా ప్లాట్లను అభివృద్ధి చేయలేదని, రైతులు పలుమార్లు అడగగా ఇటీవల టెండర్లు పిలిచారని చెప్పారు. 16 నెలలు ఓపిక పట్టి రోడ్డెక్కుతామని రైతులు హెచ్చరిస్తేనే గానీ ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. రైతులకు బ్యాంకులు నయాపైసా రుణం ఇవ్వడం లేదని, కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రుణాలు, స్థలాలు దక్కుతున్నాయని అన్నారు. రాజధానికి మొదటి దశలో భూములిచ్చిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటే రెండో దశలో మరిన్ని భూములు తీసుకోవడం సరైంది కాదని అన్నారు. రెండో దశ భూములు తీసుకోకపోతే అమరావతి మున్సిపాలిటీగా మిగిలిపోతుందని అంటున్నారని, ఈ విషయాన్ని ఎన్నికల ముందు చెప్పారా? అని నిలదీశారు. మండలంలో ఇళ్లు తొలగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని గ్రామస్తులు సూచిస్తున్నారని, వారిసూచనలను ప్రభుత్వం, సిఆర్‌డిఏ అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతిలో జరుగుతున్న పరిణామాలపై రాష్ట్రంతో పాటు కేంద్రం కూడా కళ్లు తెరవాలన్నారు. అమరావతే రాజధానని చట్టం తీసుకురావడంలో కేంద్రం అలసత్వం చూపుతోందన్నారు.

వాడీవేడిగా గుంటూరు కౌన్సిల్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోకుండా హడావుడిగా బ్రిడ్జి పడగొట్టారని వైసిపి సభ్యులు డైమండ్‌బాబు, అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి ఆచారి, బూసిరాజులత తదితరులు అభ్యంతరం తెలిపారు. సర్వీసు రోడ్డు, సైడ్ డ్రెయిన్లు నిర్మాణం పూర్తి చేసి అప్పుడు బ్రిడ్జి పనులు చేపట్టాల్సి ఉన్నా అలా కాకుండా ఏకరంగా బ్రిడ్జిని పగలగొట్టి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మేయర్ మాట్లాడుతూ భూ సేకరణ కావాలని కొంత మంది హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారని, ఇప్పటికే తాము చర్చల ద్వారానే భూములు తీసుకుని నిర్మాణం పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. టిడిఆర్ బాండ్ల వల్ల స్థలాల వారికి ఉపయోగమన్నారు. తీవ్ర వాగ్వావాదం, చర్చ అనంతరం సమావేశంలో బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరణ ద్వారా తీసుకునేందుకు తీర్మానం ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. సమావేశంలో మొత్తం 171 అంశాలలో 45 ప్రశ్నలు, 126 ప్రియంబుల్స్ ఆమోదించినట్లు మేయర్ ప్రకటించారు. శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణకు సమావేశంలో ఆమోదించామని, భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి, ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యేలు సూచించిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామని, ముఖ్యంగా హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి, పార్కుల నిర్వహణను టెండర్ ద్వారా ఏజెన్సీలకు కేటాయించి, సెంట్రల్ డివైడర్ పనులు అభివృద్ధికి ఆమోదం తెలిపామని చెప్పారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేసేదాకా పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తున్నాయని, అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయని చెప్పారు. సిఐటియు మహాసభ కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతోందని, లేబర్ కోడ్లను రద్దు చేసేదాక సిఐటియు పోరాడుతుందని చెప్పారు. సంఘాలు పెట్టనివ్వం, సమ్మెలు చేయనివ్వం అనే తప్పుడు విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వాలపై పెద్దఎత్తున ఉద్యమిద్దామన్నారు. కార్మికవర్గమంతా సమరశీల పోరాటాలకు సిద్ధమవ్వాలని, ఇందుకు కార్యాచరణ రూపొందించడం కోసం జరిగే సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎం.రవి, ఎం.భాగ్యరాజు టి.బాబు, టి.ఆదిలక్ష్మి, కె.కోటేశ్వరి, ఎం.పార్వతి, సుభాని, తిరుమలేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై నిరంతరం నిఘా : ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి)

వారు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు తెలపాలని కోరారు. స్వర్ణ భారతీనగర్‌లో 10 నుంచి 26వ లైన్ల వరకు ఆరుగురు రౌడీషీటర్లను, ఐదుగురు గంజాయి అమ్మేవారిని, ఇద్దరు సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన ధ్రువపత్రాలు లేని 57 ద్విచక్ర వాహనాలను, 9 ఆటోలను సీజ్ చేశారు. గుంటూరు ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్, పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లోనూ ఇద్దరు రౌడీ షీటర్లకు, ఒక సస్పెక్ట్ షీటర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన ధ్రువ పత్రాల్లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. మంగళగిరి పట్టణం గండాలయపేటలో నలుగురు రౌడీ షీటర్లు, ఐదుగురు సస్పెక్ట్ షీటర్లు, ఇద్దరు గంజాయి అమ్మేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. 72 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. డిఎస్‌పిలు మురళీకృష్ణ, అబ్దుల్ అజీజ్, భానోదయ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఘనంగా కెఎల్ యూనివర్శిటీ 15వ స్నాతకోత్సవం

5 వేల మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం

44 బంగారు పతకాలు- 40 రజత పతకాలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ 15వ స్నాతకోత్సవం శనివారం వడ్డేశ్వరంలోని వర్శిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. స్నాతకోత్సవం కార్యక్రమానికి నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా అధ్యక్షులు ప్రొఫెసర్ వినోద్ కె. సింగ్ ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. టాటా మెమోరియల్ సెంటర్, ముంబై ఎమ్‌డీ, ఐఎపీ పీడియాట్రిక్ హీమాటోఆంకాలజీ విభాగ చైర్ పర్సన్ ప్రొఫెసర్ శ్రీపాద్ బనవల్లి గౌరవ అతిథిగా హాజరయి విద్యార్థులకు డిగ్రీలను అందజేశారు. ఈ సందర్భంగా నిముఖ్యఅతిథి ప్రొఫెసర్ వినోద్ కె. సింగ్ మాట్లాడుతూ నేను కూడా ఒకప్పుడు మీరు ఇప్పుడు ఉన్న స్థితిలోనే ఉన్నాను, అక్కడి నుండి ఇక్కడికి ప్రయాణం చాలా ప్రయోజనకరంగా ఉందన్నారు. సమయపాలన అనేది ప్రణాళిక, దూరదష్టి మరియు క్రమశిక్షణతో సహా అనేక లోతైన లక్షణాలను ప్రతిబింబిస్తుందన్నారు. నిజాయితీగా జీవించడానికి, దేశ అభ్యున్నతి కోసం పనిచేయడానికి మిమ్మల్ని మీరు అంకితం చేసుకోవడానికి ఇప్పుడు కంటే మంచి క్షణం మరొకటి లేదని తెలిపారు. కెఎల్ యూనివర్శిటీ చాన్సులర్ కోనేరు సత్యన్నారాయణ మాట్లాడుతూ ఈ వేడుక కేవలం విద్యా విజయ వేడుక కాదు, ఇది పరివర్తన క్షణం అని అన్నారు.

2025 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 5 వేల మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు తెలియచేశారు. ఇందులో 184 మంది పి. హెచ్. డి, 700 పైగా పోస్ట్ గ్రాడ్యుయేషన్, 4 వేల 5 వందల పైగా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. వీటిలో 340 ఎంబీఏ, 105 ఎం.టెక్, 40 లా, 3200 బీ.టెక్, 12 బీ.ఆర్క్, 48 బీ.ఫార్మ్, 330 బీసీఏ, 325 బీబీఏ, 37 బీకామ్, 18 బీఎస్సీ (వీసీ), 25 బీఏ, 180 బీఎస్సీ అగ్రికల్చర్, 14 ఎం.ఫార్మసీ, 32 ఎం.ఎస్సీ (కెమిస్ట్రీ), 220 ఎంసీఏ డిగ్రీలు ఉన్నాయి. ఈ డిగ్రీలను ప్రత్యక్షంగా ప్రదానం చేయనున్నారు.నిరిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరచిన 44 మంది విద్యార్థులకు బంగారు, 40 మందికి రజత పతకాలను, నగదు బహుమతులను అందించినట్లు ఆయన చెప్పారు. బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులకు,



ప్రో-ఛాన్సలర్, ప్రో వైస్-ఛాన్సలర్లు, రిజిస్ట్రార్, డీన్‌లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, విశిష్ట అధ్యాపక సహోద్యోగులకు హదయపూర్వక అభినంధనలు తెలిపారు. ఈ రోజు సగర్వంగా పట్టభద్రులవుతున్న నాయకులు, ఆవిష్కర్తలను పెంపొందించడంలో వీరందరి అచంచలమైన నిబద్ధత కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమానికి కోనేరు సత్యన్నారాయణ గారు అధ్యక్షత వహించారు. సంధాత కర్త, వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావులు వ్యవహరించారు. కార్యక్రమంలో కెఎల్ ఇఎఫ్ కార్యదర్శి శ్రీమతి కోనేరు శివకాంచనలత, ఉపాధ్యక్షులు శ్రీ కోనేరు రాజా హరీన్, బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల తదితరులు పాల్గొన్నారు.

389 రోజులుగా ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 389 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ముసలా సాంబశివరావు, షైక్ సుభాని, బూరగఅంకయ్య, తుపాకుల నాగేశ్వరావు, వై సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో దేరంగుల రమణమ్మ, ఉప్పు కాసమ్మ, వేము రిబ్కా, మొలక శారదా,వేముల. లక్ష్మమ్మ కూర్చున్నారు. కార్యక్రమం లో వైరమాదేవి, శారమ్మ,సువర్ణ కుమారి, జిఅన్నమ్మ, యహోషువ, డి నాగేశ్వరావు, ఆశీర్వాదం, కొండా పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తాడేపల్లి

చదువు నిమిత్తం ఓ విద్యార్థినికి రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందజేసింది.విజయవాడ యనమలకుదురు ప్రాంతానికి చెందిన బెల్లంకొండ పునీత ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. ఆర్థిక అవసరాల నిమిత్తం ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలుసుకున్న రామ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు,రామ్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు,దాత కాటూరి శివ లు శనివారం ఆ విద్యార్థిని తండ్రి కి రూ.10 వేలు చెక్కు రూపంలో అందజేశారు.ఈ సందఠరేగా విద్యార్థిని తండ్రి రమేష్ బాబు, డాక్టర్ పలగాని శ్రీనివాసరావు కు క తజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఊడిజర్ల గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఊడిజర్ల ఎస్సి కాలనీకి చెందిన వంగల పాల్ ద్విచక్ర వాహనంపై గ్రామంలోని పాలకేంద్రం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా సాగర్ కాల్వ వంతెన సమీపంలోకి రాగానే కారు ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొట్టడంతో పాల్ ముఖానికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని చికిత్సకోసం వినుకొండ తరలించి అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ఆసుపత్రి కి తరలించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

విద్యార్థులు అన్ని రంగాలలో తమ ప్రతిభను చాటి ఎదగాలని పాలపర్రు ఎమ్.పి.టి.సి.కమ్మ సాంబశివరావు కోరారు.శనివారం పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ పాఠశాల లో పోటీ పరీక్షలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు.చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని ఆయన అన్నారు. పెద్దల పట్ల గౌరవభావంతో మెలగాలని, మంచి నడవడికతో ఎదగాలని కోరారు.పదవ తరగతి పరీక్షలలో ప్రథమ,ద్వితీయ, త తీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు జీవితాంతం క్యాష్ ప్రైజ్ అందిస్తానని వాగ్దానం చేశారు.ముందుగా పాఠశాల వ్యవస్థాపకులు ముద్దన చెంచయ్య గారి విగ్రహానికి పాఠశాల పూర్వ విద్యార్థి దుద్దెంపూడి సత్యనారాయణ , పూర్వ విద్యార్థులు దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, కమ్మ సాంబశివరావు, దుద్దెంపూడి రవీంద్రబాబు, నూతి పూర?చంద్రరావు, బండారు రాంబాబు లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు మాట్లాడుతూ,నా 32 సం.ల సర్వీసు లో మన పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందడం, పాల్గొన్న అన్ని పోటీ పరీక్షలలో బహుమతులు సాధించడం ఇదే ప్రథమమని,నేను ప్రధానోపాధ్యునిగా ఉన్న సమయంలో ఈ ఘనత సాధించడం నాకు ఎంతో గర్వకారణం గా ఉందని అన్నారు.అందుకు క షి చేసిన ఉపాధ్యాయులకు, విధ్యార్థినీ విధ్యార్థులకు అభినందనలు, క తజ్ఞతలు తెలిపారు.

ఈ సంవత్సరం జరిగే పదో తరగతి పరీక్షలలో కూడా ఇదేవిధంగా క షి చేసి మార్కులలో జిల్లాలో ప్రథమ స్థానం సంపాదించాలని కోరారు.దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలలో ద్వితీయ బహుమతి, సైన్స్ ఫెయిర్ లో రాష్ట్ర స్థాయి కి ఎంపిక కావడం, క్విజ్ పోటీలో మండల స్థాయి లో ప్రథమ బహుమతి సాధించడం మన స్కూల్ కు, గ్రామానికి గుర్తింపు తెచ్చారని విధ్యార్థినీ విధ్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వడ్డేశ్వరంలో అనారోగ్యంతో యువతి మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో గుంపెన రోషిత (23) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్ను మూసింది. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన రోషిత గత సంవత్సర కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద ఉంటుంది. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడటంతో గుంటూరు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచింది. గుంపెన మహాలక్ష్మి, సురేష్ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తె అయిన రోషిత డిగ్రీ బీఎస్సీ చదువుతోంది. రోషిత తల్లి డ్వాక్రా యానిమేటర్ కావడంతో పలువురు డ్వాక్రా యానిమేటర్లు యువతి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. శనివారం ఉదయం రోషిత అంత్యక్రియలు జరిగాయి.

కొలనుకొండలో మహిళ మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండ గ్రామానికి చెందిన బళ్ల శ్రీలక్ష్మి (42) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో శ్రీ లక్ష్మీ బాధపడుతుంది. శనివారం ఆమె నివాసములో తుది శ్వాస విడిచింది. ఆమెకు కుమారుడు, కుమార్తె, ఉన్నారు. భర్త బళ్ల శ్రీనివాసరావు వ్యవసాయ దారుడు. శ్రీలక్ష్మి మతి వార్త తెలుసుకున్న సిపిఎం గ్రామ సీనియర్ నాయ కులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, నాగేశ్వరమ్మ, కాట్రగడ్డ శివన్నారాయణ, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు శ్రీలక్ష్మీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



65 టన్నుల ఎరువులు సీజ్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ఎం.సంధ్యారాణి శనివారం తనిఖీ చేశారు. రూ.13 లక్షల 53 వేల 25 విలువ చేసే 65.1 మెట్రిక్ టన్నుల ఎరువులకు సంబంధించి వ్యత్యాసాన్ని గమనించి విక్రయాలను నిలిపేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు కావాల్సిన రైతులు సొసైటీల్లో కానీ పట్టణంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాల నుండి ఎరువులను పొందొచ్చని తెలిపారు. వ్యాపారులు ఎవరైనా ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో యూరియా 350 టన్నులు అందుబాటులో ఉంచామని, యూరియా లభ్యతను సూచించే బోర్డులను ప్రతి దుకాణం వద్ద పెట్టాలని ఆదేశించారు.



రౌడీషీటర్లపై పూర్తిస్థాయి నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి - నకరికల్లు

రౌడీ షీటర్లపై పూర్తిస్థాయిలో పోలీసుల నిఘా ఉంటుందని పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. నకరికల్లు పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, దొంగతనాలు జరగకుండా రాత్రి సమయాలలో పూర్తిస్థాయిలో గస్తీ ఉంటుందని చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట సత్తెనపల్లి రూరల్ సిఐ పి.కిరణ్, ఎస్ఐ సతీష్ ఉన్నారు.

నేడు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-దాచేపల్లి

వినుకొండలో ఆదివారం నిర్వహించే యుటిఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి టి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశాల్లో చర్చించి వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరవ్వాలని కోరారు.



కేసులు పెట్టినా పోరాడి తీరుతాం

- సిఐటియు నాయకులు ఉద్ఘాటన
- జాతీయ మహాసభ జయప్రదం కోసం

పల్నాడు జిల్లాలో ముగిసిన ప్రచారజాతా



సిఐటియు అఖిలభారత మహాసభ ఈ నెల 31 నుండి వచ్చేనెల 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో నిర్వహించనున్న నేపథ్యంలో మహాసభతోపాటు 4వ తేదీన కార్మిక ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం కోసం పల్నాడు జిల్లాలో రెండ్రోజులపాటు నిర్వహించిన ప్రచార జాతా శనివారం ముగిసింది. రెండోరోజైన శనివారం రెంటచింతలలో ప్రారంభమైన జాతా గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, క్రోసూరులో ద్వారా సత్తెనపల్లిలో ముగిసింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జాతాకు వివిధ రంగాల కార్మికులు, స్కీమ్ వర్కర్లు ఘన స్వాగతం పలికారు. వివిధ సంఘాలు సంఘీభావం తెలిపాయి.

ప్రజాశక్తి - సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణానికి చేరుకున్న జాతాను అచ్చంపేట రైల్వే గేట్ వద్ద కార్మికులు బైక్ ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు. అనంతరం గార్లపాడు సెంటర్ వద్ద సిఐటియు నాయకులు రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలో వచ్చినప్పటి నుండి రైతులు, కార్మికుల పైన కక్షగట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేసి తిప్పికొట్టారని చెప్పారు. ఇప్పుడు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగానూ కార్మికులు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి జి రాంజీగా పథకాన్ని తెచ్చారని, ఇది కూలీలకు తీవ్ర నష్టమని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, అడవులను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల నివాస ప్రాంతానికి జాతా వెళ్లగా అక్కడ నిర్వహించిన సభలో సిఐటియు రాష్ట్ర నాయకులు గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కార్మికుల స్థితిగతులు మారడం లేదని, కార్మికులకు అండగా ఉన్న నాయకులపై కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. అయినా భయపడేది లేదని, జనం కోసం పోరాడి తీరుతామని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డి.విమల, జి.రజిని, జి.ఉమశ్రీ, వి.చంద్రకళ, ఎ.వీరబ్రహ్మం, జి.మస్తాన్‌రావు, పి.మహేష్ నూర్‌బాషా సైదులు, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, వెంకట నారాయణ, శ్రీను, పి.సూర్యప్రకాశరావు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కార్మికుల్ని, కర్షకుల్ని కులమతాల పేరుతో వేరుచేస్తున్న కేంద్ర ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, కార్మికుల్ని బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలని సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయలు నాయక్ పిలుపునిచ్చారు. సిఐటియు ప్రచారజాతా మాచర్లకు వచ్చిన సందర్భంగా మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గుర్రం జాషువా విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి కార్మికులు సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్రం తెచ్చిందని, వీటి వల్ల కార్మికులు బానిసలుగా మారతారని చెప్పారు. ప్రాణ త్యాగాలతో సాధించిన ఎనిమిది గంటల పని విధానాన్ని తీసివేసి 13 గంటల పని విధానం అమలు చేస్తున్నారని, ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం పెట్టిందని మండిపడ్డారు. మహిళలపై అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్న తరుణంలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుంటే రాత్రి పని విధానం వల్ల మహిళలకు రక్షణ మరింత ప్రమాదంలో పడుతుందని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తుండగా దీన్ని విస్మరించి ప్రభుత్వ సంస్థలు కూడా ప్రైవేట్ పరం చేస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్నీ దెబ్బతీసే విధానాలు అవలంబిస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు ఐక్యం కాకుండా మత చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. జాతాకు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిలభారత జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు మున్సిపల్ కార్మికులు, అంగన్వాడి వర్కర్లు, హమాలీలు పాల్గొన్నారు.







ప్రజాశక్తి - రెంటచింతల, బెల్లంకొండ, దాచేపల్లి

ప్రచార జాత రెంటచింతల, బెల్లంకొండకు చేరుకోగా సిఐటియు మండల కార్యదర్శి తిక్క నాగేశ్వరరావు, బెల్లంకొండ మండల కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జె.వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.ప్రకాశరావు తదితరులు స్వాగతం పలికారు. ఆంజనేయులు నాయక్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త పథకాన్ని తెచ్చారని, గతంలో 90 శాతంగా ఉన్న కేంద్రం వాటాను 60 శాతానికి తగ్గించారని, ఇది కూలీలకు తీవ్ర నష్టమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాల వాటా 10 శాతంగా ఉన్నపుడే కూలీలకు వేతనాలు సరిగా ఇవ్వలేదని, ఇకపై ఈ పరిస్థితి ఇంకా దారుణంగా మారుతుందని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రచారంలో వివిధ రంగాల కార్మికులు, స్కీమ్ వర్కర్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటితో పాటు పరిసరాలనూ శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే తమ ఇంటితోపాటు పరిసరాల శుభ్రత పాటించి పర్యావరణాన్ని కాపాడడం ద్వారా భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని మాచర్ల జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ కళ్యాణ్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భముగా మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మాచర్ల శ్రీ సత్యసాయి హైస్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి ఎస్ .శ్రీనివాస్ కళ్యాణ్, స్కూల్ డైరెక్టర్స్ ఎన్.అనిల్ కుమార్, జక్క శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ రమాదేవి, ఏజీపీ గంగుల శ్రీనివాసరావు, ఎక్స్ ఏజిపి జి .వి, మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు



శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ చెట్లు మనకి మంచి ఆక్సిజన్‌ను అందించి మనము వదిలే కార్బన్‌డై ఆక్సైడ్‌ను ఆ చెట్లు పీల్చుకొని మనకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరించారు. చెట్లను మనం కొట్టివేయకుండా వాటిని కాపాడి మరలా కొత్త మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా వెలగపూడి లక్ష్మణదత్తు జయంతుత్సవం

ప్రజాశక్తి - మాచర్ల

కెసిపి సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ వెలగపూడి లక్ష్మణదత్తు 88వ జయంతుత్సవాలను కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో శనివారం ఘనంగా నిర్వహించారు. కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలోని లక్ష్మణదత్తు విగ్రహానికి కెసిసి సినియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు. కెసిపి సంస్థలను ఆధునిక సాంకేతక పరిజ్ఞానంతో ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన ఘనత లక్ష్మణదత్తుదన్నారు. ఆయన జయంతిని నాణ్యతా దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. కెసిపి సంస్థలు నాణ్యతకు పెద్ద పీట వేస్తాయని, నాణ్యతా ప్రమాణాలు పాటించి సంస్థల మొదటి వరసలోనే



కెసిపి వుంటుందని అన్నారు. అనంతరం ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసం డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ నర్సరావుపేట వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురు రక్తదానం చేశారు. నాణ్యతా దినోత్సవం గురించి జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఫ్యాక్టరీ ఉద్యోగులందరికి భోజనాలు, మిఠాయి ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సంస్థ హెచ్‌ఓడిలు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడం ఆపాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న పాశం రామారావు తదితరులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాన్ని విడనాడాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. శనివారం పెదనందిపాడు లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి, ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో జాతిపిత మహాత్మా గాంధీ పేరు తీసివేసి, చట్టంలో ఉన్న అనేక అంశాలను సవరణ చేస్తూ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) 2025 చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. దీనిలో పని కోరే ప్రతి గ్రామీణ కుటుంబానికి చట్టబద్ధమైన ఉపాధి హక్కును నిరాకరిస్తున్నదని తెలిపారు. పనిని బట్టి నిధులు కాకుండా, నిధులను బట్టి పని సవరణ చేశారన్నారు. కొత్త చట్టం ప్రకారం వ్యవసాయ పనులు ఉన్న రోజులలో 60 రోజులపాటు ఉపాధి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. దీనివల్ల భూమిలేని కూలీలు తక్కువ వేతనాలకు భూస్వాముల వద్ద పనిచేయాల్సి వస్తుంది అన్నారు. కాబట్టి 2025 కొత్త చట్టాన్ని రద్దుచేసి 2005 చట్టాన్ని అమలు చేసి, రెండు వందల రోజులు పనులు కల్పించాలని, కనీస వేతనం రూ.700 ఇవ్వాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పంట కాలువలు , భూ అభివద్ధి పనులు, భూగర్భ జలాలు పెరిగే పనులు చేయించాలని కోరారు. పని దినాలను 100 రోజుల నుండి 200 రోజులకు పెంచాలని కోరారు. వ్యక్తిగత హక్కు ఆధారంగా ఉపాధి కల్పించాలని, వేతనాలను ఆలస్యం లేకుండా చెల్లించాలని, పర్యవేక్షణ మరియు ప్రణాళిక కోసం గ్రామ సభలకు పూర్తి అధికారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఆందోళనలు ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, నల్లమోతు రాజేంద్ర, ముద్దన వెంకటేశ్వర్లు, పెన్షనర్స్ సంఘం నాయకులు జంపని రామారావు, మహిళా సంఘం నాయకులు ఫణిదపు భువనేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : నూతనంగా ప్రవేశపెట్టిన ఉపాధి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పాత చట్టం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ పొనుగుపాడు గ్రామ సభలో ఎమ్మార్వోకి వినతి పత్రాన్ని నాయకులుకె కోటేశ్వరరావు,ఎస్ఎం వలి తదితరులు అందజేశారు.



ఫిరంగిపురంలో

ప్రజాశక్తి - మేడికొండూరు : మండలంలోని సిరిపురంలో ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి కౌలు రైతు సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి శ్రీనివాసరావు, కె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో



సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి - తుళ్లూరు

జనవరి 4న విశాఖలో జరిగే మహా కార్మిక ప్రదర్శన కు తరలిరావాలని సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. మండలం లోనినిమందడంలో శనివారం జరిగిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు ఏమాత్రం పరిష్కరించటానికి శ్రద్ధ చూపడం లేదని అన్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా నెలల తరబడి పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. గత నిరవధిక సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందం ప్రకారం 2024 జూలైలో అంగన్వాడీల వేతనాలు పెంపుదల చేయాల్సి ఉన్నానినేటికీ వేతనాల పెంపుదలపై ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఆర్భాటంగా ప్రకటించిన అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు జీవో విడుదల చేసి 10 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఒక్కరికి కూడా గ్రాట్యూటీ చెల్లించలేదని అంగన్వాడీల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం అని ఎద్దేవా చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్ననిమెనూ చార్జీలు పెంచడం లేదని అంగన్వాడీల పై నిరంతరం ఏదో ఒకనిసాకుతో పని భారాన్ని పెంచుతున్నారని అన్నారు.నికేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్ లు తీసుకువచ్చి దేశంలోని కార్మికు లందరినీ పాత బానిస వ్యవస్థలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నదని, కార్మిక చట్టాల పరిరక్షణకు జరిగే పోరాటంలో దేశంలోని కార్మిక వర్గంతో పాటు అంగన్వాడీలు భుజం కలిపి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు ఎం రవి, కుంభా ఆంజనేయులు, షేక్ జానీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

సిఐటియు అఖిల భారత మహాసభ, 4న ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం కోసం మండలంలో ప్రచార జాతా చేపట్టారు. జాతాను సుందరయ్య నగర్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ ప్రారంభించి మాట్లాడారు. కార్మికులు సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించపోగా కొత్త సమస్యలు తెస్తున్నాయని, ఉద్యమాలను అణచాలని చూస్తున్నాయని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో భాగంగా జరిగే సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి కార్మికవర్గమంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బురద´గుంట సాంబయ్య ఏ నాగేశ్వరావు జెట్టి రాజ్య లక్ష్మి ఎం సాంబయ్య డి లక్ష్మీ కాంతమ్మ పార్వతి షేక్ మస్తానమ్మ పాల్గొన్నారు.



ప్రజాశక్తి- తాడేపల్లి



గత పది సంవత్సరాల కాలం నుండి ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు అనుగుణంగా రాజధాని లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు కూడా పెంచాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి, భాగ్యరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

కార్మిక హక్కులను కాలరాచే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. శనివారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులు అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడులను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాచారన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానం తెచ్చారని చెప్పారు. కనీస వేతనాలను అమలు చేయడం లేదన్నారు. అదే విధంగా రాష్ట్రంలో భూములను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతున్నారన్నారు. సాగు భూములను, మూడు పంటలు పండే నాణ్యమైన పొలాలను రైతుల సమ్మతం లేకుండా తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు భూములను పేద ముస్లింల ప్రయోజనం కోసం వినియోగించకుండా, కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. ఓట్ల తొలగింపుల కోసం సర్ చట్టం తీసుకువచ్చి బీహార్ తదితర రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని తెలిపారు. ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయడం లేదన్నారు పత్తి కొనుగోలు కూడా సక్రమంగా జరగటంలేదని, నాణ్యత ప్రమాణాలు పేరుతో తిప్పి పంపిస్తున్నారన్నారు.రైతు సేవా కేంద్రాలలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, ఫణిదపు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



7వ రోజుకు ఎం.బుక్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

తాడేపల్లి ఎం బుక్ కార్మికులను నైట్ డ్యూటీలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన దీక్ష కార్యక్రమం శనివారం నాటికి తొమ్మిదవ రోజుకు చేరింది. సిఐటియు నాయకులు బి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎం బుక్ కార్మికులను పగలు డ్యూటీలకు రావాలని కాంట్రాక్టర్ల ఒత్తిడి తీసుకురావడం దారుణమైన అన్నారు. దీనివలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి నైట్ డ్యూటీ లను కొనసాగించాలని కోరారు. నాలుగు సంవత్సరాల క్రితం చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. పగలు డ్యూటీలు చేస్తే మాత్రం 21 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయమ్మ, కనకదుర్గ, పార్వతి, వాసంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బోగి ఎస్టేట్ లోని మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఏడవ రోజు 10 జట్టుల మధ్య ఐదు మ్యాచ్ లు నిర్వహించగా లయన్స్ వారియర్స్ టీమ్, ఫ్లాష్ మాన్ టీమ్, రైడర్స్ లెవెన్, సులోచన సీసీ, నో మాన్స్ లాండ్ టీంలు విజయం సాధించాయి,ప్రతి మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచిన క్రీడాకారుడుకి మాన్ అఫ్ ది మ్యాచ్ ట్రోఫీ, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో 3 వేల రూపాయల నగదు బహుమతి అందజేసిన కూటమి నాయకులు,రేపు 10 జట్టుల మధ్య ఐదు మ్యాచ్ లు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ తెలిపారు. ఈవెంట్ స్పాన్సర్లుగా సాయి పావని కన్ స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, బిజ్ 51, సోనోవిజన్, హొటల్ డి దేవ్, తాడేపల్లి మెడ్ స్టార్ హాస్పటల్స్, సిగ్నేచర్ డైన్, హైపర్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్, కోకోకోలా, వీ వైబ్ ఈవెంట్స్ వ్యవహరించనున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపీ టీవీ యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించడం జరుగుతుంది ప్రీమియర్ లీగ్ సీజన్-4 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలు మంగళాద్రి డెవెలపర్స్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు మంచికలపూడి వైష్ణవి, తృతీయ బహుమతి కింద రూ.లక్ష నగదును వెలగపూడి కిషోర్ సహకారంతో అందించనున్నారు. అలాగే ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.3 వేలు జవ్వాది కిరణ్ చందు, ప్రతి మ్యాచ్ టాస్ విన్నర్‌కు సిల్వర్ కాయిన్, అలాగే ఫైనల్ మ్యాచ్ టాస్ విన్నర్‌కు గోల్డ్ కాయిన్ రేవతి జ్యూయలరీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎలక్ట్రానిక్ బైక్ వల్లభనేని భార్గవ్, బ్యాట్స్ మెన్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు ఎలక్ట్రికల్ బై సైకిల్ కాసరనేని జస్వంత్, బౌలర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు బై సైకిల్ గుత్తా కిషోర్, ఫీల్డర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలతో పాటు బైసైకిల్ తాడిబోయిన మహేష్, వికెట్ కీఫర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బై సైకిల్ షేక్ ఇంతియాజ్‌లు అందించనున్నారు. మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులకు టీ షర్ట్స్, ట్రాక్స్ అందజేస్తున్నారు.

సిఆర్‌డిఎ గ్రీవెన్స్‌కు 37 అర్జీలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి లోని రాయపూడి సి ఆర్ డి ఎ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రీవెన్స్ లో అధికారులకు 37 అర్జీలు అందాయి. భూమి వ్యవహారాలకు సంబందించి 28, ప్లానింగ్ విభాగానికి 3, సామాజిక సంక్షేమం(ఇంజినీరింగ్)కు 2, డెవలప్ మెంట్ ప్రమోషన్1,ఎస్టేట్స్1, ఇనార్మేషన్ సిస్టమ్స్ 1, సామాజిక సంక్షేమంకు సంబంధించి1 చొప్పున అర్జీలు అందాయని సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ ఎ భార్గవ్ తేజ చెప్పారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వసంత రాయడు, గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ,పి. ఇతర అధికారులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ చెన్నకేశవులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక నరసరావుపేట సెంటర్‌లో అర్బన్ పోలీసులు శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో వాహనదారుల పత్రాలను పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని వాహనదారులను గుర్తించి, వారికి నిబంధనల ప్రకారం అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.




స్క్రబ్ టైఫస్‌పై అవగాహన నిర్వహిస్తున్న అధికారులు

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక విజ్ఞాన్ విద్యా విహార్ హైస్కూల్‌లో స్క్రబ్ టైఫస్‌పై టీచర్లు, విద్యార్థులకు శనివారం అవగాహన సద్సు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.సి.హెచ్.నారాయణ మాట్లాడుతూ స్క్రబ్ టైఫాస్ అనేది నల్లి జాతికి చెందిన చిగర్ మైట్లు అనే చిన్న పురుగులు కరిచినప్పుడు మనుషులకు వస్తుందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, వణుకు, తలనొప్పి, ఒళ్ళునొప్పులు, గజ్జలలో వాపు, నల్లటి మచ్చలతో కూడిన దద్దుర్లు వంటి లక్షణాలు కనబడితే వెంటనే దగ్గరలోని పీహెచ్సీ లేదా ఏరియా హాస్పిటల్‌లో చికిత్స కోసం సంప్రదించాలి సూచించారు. అవగాహన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షేక్ సుభాని, ఎన్.శివయ్య, హెల్త్ అసిస్టెంట్లు కోటేశ్వరరావు, జిలానిపీర్ వలి, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పశువులకు మేత వేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

అభివృద్ధి పథమే ప్రభుత్వ నినాదం..!

ప్రజాశక్తి - విజయపురిసౌత్

అభివృద్ధి పథమే కూటమి ప్రభుత్వ నినాదం అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగులవరం, కొప్పునూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. నూతనంగా నిర్మించిన రూ. 8 లక్షల విలువ చేసే మినీ గోకులాల షెడ్లను ప్రారంభించారు. రూ. 5 లక్షల చొప్పున రూ. 10 లక్షలు విలువ చేసే నూతన సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సిఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారనన్నారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజ బోయిన మల్లేశ్వరి మధు, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షులు నేరేటి వీరస్వామి, జల్లెల కొండలు, మైలంపల్లి అప్పలరాజు, వస్తూపురి శ్రీరామ్మూర్తి, ఎరుపల్లి వెంకటేశ్వర్లు, కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న కరివేపాకు సాగు

- ప్రతి మూడు నెలలకు ఒకసారి కోత
- తక్కువ ఖర్చులతో ఎక్కువ లాభాలు
- పదుల సంఖ్య నుంచి వందల ఏకరాల్లోకి పెరిగిన సాగు



ఏపుగా పెరిగిన కరివేపాకు పంట

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తక్కువ ఖర్చు దీర్ఘకాలిక పంట కరివేపాకు. అత్యంత తక్కువ ఖర్చుతో ప్రతి మనిషికి కావాల్సినంత "ఏ" విటమిన్ సమృద్ధిగా ఉన్న కరివేపాకు పంట ప్రస్తుతానికి రైతులకు సిరుల పంటగా ఉంది. ఈ కరివే పాకు లేకుండా అసలు కూరరలు ఉండవు. ప్రస్తుతానికి ఈ పంట ప్రాముఖ్యత తెలుసుకున్న రైతులు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. పత్తి, శనగ పంటల కు దిగుబడి తగ్గుదల, పురుగు, మిర్చి పంటకు తెగులు, పొగాకు పంటను ప్రభుత్వం నిలుపుదల చేయడంతో రైతులు ఏ పంటను సాగు చేయాలిఓ తెలియక అయోమయంలో ఉన్నారు. ఈ సమయంలో ఈ కరివేపాకు పంట రైతులకు సిరుల పంటగా కని పించిసాగుకు ఉత్సాహం చూపుతున్నారు. మండల స్థాయిలో పదుల స్థాయిలో సాగు చేసే రైతులు ప్రస్తుతానికి ఒక్క కట్టుబడివారి పాలెంలో 400 వందల ఏకరాలు సాగు చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో 8,900 వందల ఎకరాల్లో సాగు చేస్తున్నాట్లు సమాచారం. మండల మొత్తం 5, 600 వందల ఏకరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటను కట్టుబ డివారి పాలెం, ఈటీ, కోటప్పకొండ, మురికిపూడి, కొద్ది పాటి సాగును కావూరు రైతులు చేస్తూ ప్రస్తుతానికి లాభాలను గడిస్తున్నారు. విత్తనం వేసి దగ్గరనుంచి ఆరు నెలల్లో మొదటి పంట కోతకు వస్తుందని ఈ.టి. గ్రామానికి చెందిన తిమ్మిశెట్టి వెంకయ్య అనే రైతు అంటున్నారు. తరువాత మూడు నెలలకు ఒక సారి చొప్పున పంట కోతకు వస్తుంది. మొదటి సంవత్సరం మూడు కోతలు మాత్రమే వస్తా యి. తరువా త సంవత్సరం నుంచి సంవత్సరానికి 4కోతలు చొప్పున దీర్ఘకాలికంగా 20, 25 సంవత్సరాలు పంట వస్తూనే ఉంటుంది. మొదటి సంవత్సరం మొదటి పంటగా 12,15 టన్నులు దిగుబడి వస్తుంది. ఈ విత్తనాలకు మంగళగిరి రాష్ట్ర స్థాయిలో ప్రఖ్యాతి గాంచింది. ఒక ఎకరాకు విత్తనాలు 3 వేల కేజీల నుంచి 3500 కేజీల వరకు పడతాయి. విత్తనాల ధర కేజీ 40 రూపాయల దాకా ఉంది. విత్తనం నాటిన (నాటిన తరువాత 30 రోజులకు మెలకెత్తుతుంది.) ఆరో నెలలో దిగుబడి వస్తుంది. అక్కడ నుంచి ప్ర తి మూడు నెలలకు దిగుబడి వస్తుం ది. రెండో సంవత్సరం నుంచి సంవ త్సరానికి 4 సార్లు కోతకు వస్తుంది. మొదటి సంవత్సరం పెట్టుబడి ఒక ఎకరాకు బోదెలు,వ్యవసాయం, విత్త నాల కొనుగోళ్లు,నాటటం మిగిలిన ఖర్చులు 1.50 లక్షలు అయ్యాయి అంటున్నారు....ఈ పంటకు మంచు,శితా కాలంలో, వర్షాల వల్ల ఎక్కువగా మచ్చ తెగుళ్ళ,పెను బంక, నాంజేడు తెగుళ్ల లాంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. కొద్దీ పాటి పురుగు కూడా ఆశించిన పురుగు వల్ల ప్రమాదం ఉందంటు న్నారు....కేజీ కరివేపాకు ధర ప్రస్తుతం రూ. 40 రూపాయల దాకా ఉంటుంది. పొలాల వద్దకే మధ్యవర్తులు వచ్చి కొనుగోలు చేస్తారు. వ్యవసాయ శాఖ స్పందించి ఈ కరివేపాకు పంట పై రైతులకు అవగాహన కల్పించి వాణిజ్య పంటలకు ధీటుగా ప్రోత్స హించే విధంగా విత్తనాలను, తెగుళ్ల మందులు పూర్తిస్థాయిలో సబ్సిడీలో ఇచ్చి ప్రోత్సహిచటం, లేదా నాణ్యమైన, అధిక దిగుబడులు నిచ్చే విత్తనాలను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవడం చేస్తే రైతులకు లాభదాయకంగా సిరుల పంటగా ఉంటుంది.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న రవాణా శాఖ అధికారులు

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ప్రమాదాలకు గురి కాకుండా ఉండే అవకాశం ఉంటుందని నరసరావుపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించిన అనంతరం శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అత్యంత విషాదకరమైన సంఘటనలు అన్నారు. జిల్లా కలెక్టర్-జిల్లా రహదారి భద్రత కమిటీ చైర్మన్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి సరైన సమయంలో సహాయం అందించాలన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మనీషా మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో రోడ్డు ప్రమాదాలు తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సభ్యులు ఆర్.బంగారయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ ఎన్జీవోల భాగస్వామ్యంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సిపిఆర్ పై అవగాహన, నగదు రహిత వైద్య సదుపాయం ఏర్పాటు గురించి హెల్మెట్ గురించి సీట్ బెల్ట్ గురించి మద్యం సేవించి వాహనం నడప రాదని తదితర రోడ్డు భద్రత అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల యాజమాన్యం రవాణాశాఖ అధికారులను దుశ్శాలువాతో సత్కరించారు.

అంతరపంటలతో రైతులకు అదనపు ఆదాయం

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రధాన పంటతో పాటు పలు పంటలు అంతర పంటలు వేయటం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని క్రోసూరు మండల వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు అన్నారు. శనివారం రైతు విజ్ఞాన యాత్ర కార్యక్రమంలో భాగంగా క్రోసూరు, అచ్చంపేట మండలం లోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ట్రైనింగ్ ఐ సి ఆర్ పి, ఐ సి ఆర్ పి, ఎఫ్ఎమ్టిలు, రైతు సేవా కేంద్ర విఏఎల్ తో కలిసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట మండలంలోని చిగురుపాడు గ్రామంలోని ప్రకఅతి వ్యవసాయ రైతు జయలక్ష్మి సాగు చేస్తున్న రెండు ఎకరాల భూమిలోని ప్రధాన పంటతో పాటు పలు అంతర పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఏఏలు పవన్, నాయక్, క్రోసూర్ డివిజన్ ఎంపిటి జయలక్ష్మి, ఎఫ్ఎమ్టి శ్రీనివాసరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆనందపేటలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - రెంటచింతల

కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామం మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పల్లెపండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా రెంటచింతలలో శనివారం ఆనందపేటలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు 10 లక్షలు కేటాయించగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గొంటు సుమంత్‌రెడ్డి, బి.రామకృష్ణ, ఎం.శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి నాలుగో విడత రీ సర్వే

ప్రజాశక్తి-ముప్పాళ్ల

జనవరి 2 నుంచి ముప్పాళ్ల గ్రామ రెవెన్యూ పరిధిలో నాలుగవ విడత రీసర్వే ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ కె.నగేష్ తెలిపారు. ముప్పాళ్ల గ్రామ సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, రైతులు తమ భూమి వద్దకు వెళ్లి హద్దులు చూపించాలన్నారు. రైతులు రీసర్వేలో సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆంజనేయులు, సర్వేయర్ రాజు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

లక్కరాజుగార్లపాడులో..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూములు రీసర్వేతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని సత్తెనపల్లి మండల తహశీల్దార్ కె.ఎస్. చక్రవర్తి రైతులకు వివరించారు. మండలంలోని కట్టమూరు, లక్కరాజుగార్లపాడు గ్రామాల్లో నాల్గో విడత భూములు రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం గ్రామసభలు నిర్వహించారు. రీ సర్వేపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బోస్ బాబు, మండల సర్వేయర్ విజయ్ కుమార్, గ్రామ సర్వేయర్ లు, గ్రామ రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నిర్వహించారు. సత్తెనపల్లి కన్నా కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కుఫిర్యాదులు అందించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పవులూరికి సన్మానం

టిడిపి పల్నాడు జిల్లా కమిటీలో పదవులు పొందిన వారిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఘనంగా సత్కరించారు. సత్తెనపల్లి రఘురామ్ నగర్ కార్యాలయంలో జిల్లా కమిటీలో నూతనంగా నియమింపబడిన జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి పూల వెంకట కోటయ్య, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శులుగా గొర్రెపాటి సుశీల, అట్లూరి పుల్లమ్మ , జిల్లా కార్యదర్శి సయ్యద్ మాబులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల భాగస్వామ్యంతోనే ప్రగతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మహిళల భాగస్వామ్యంతోనే ప్రగతి, ప్రజా సంక్షేమానికి దోహదమని నరసరావుపేట పార్లమెంట్ కార్యని ర్వాహక కార్యదర్శి అమరా రమా దేవి అన్నారు. పట్టణంలోని మూడు అన్నా క్యాంటీన్లకు కొత్తగా నియమితులైన ఛైర్మన్ల సన్మాన కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ తెలుగు మహిళల శక్తియుక్తులు ప్రపంచానికి చాటిన ఏకైకవ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. పట్టణంలోని మూడు అన్నా క్యాంటీన్లకు కొత్తగా నియ మింపబడిన ఛైర్మన్‌ పాములపాటి శివమ్మను సత్కరించారు. తమకు అప్పగించిన బాధ్యతల్ని సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తాయపి మహిళా నేతలు తెలిపారు. నియోజకవర్గ వర్గ మహిళా అధ్యక్షరాలు అద్దంకి అనిత, ప్రధాన కార్యదర్శి గుదే అంజలి, అంగన్‌వాడీ నియోజకవర్గ ఎస్.హెచ్.జి నల్లమోతు ఉదయ లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు కునాల ప్రమీల లను అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీ పీ కరీముల్లా, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

పట్టణంలోని చౌత్ర సెంటర్ ఆంజ నేయ స్వామి గుడి సమీపంలో ఉన్న జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (గార్డ్స్) కార్యాలయంలో శనివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. రిటైర్డ్ జడ్జ్ కంచర్ల విజయ కుమార్ క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లి బాబు, కోశాధికారి తలతోటి ఎఫ్రా యిము, డాక్టర్‌ పీవీ సుబ్బారావు, డాక్టర్‌ విన్సెంట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.







మంగళగిరి, పెదకాకాని మండలంలో ఉప్పలపాడులో, తెనాలిలోని చినరావూరు ఐటిఐలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గంజాయి రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - మంగళగిరి

గంజాయిలేని జిల్లాగా గుంటూరు జిల్లాను తీర్చిదిద్దాలనే సంకల్పంతో, యువతను గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచాలనే ప్రధాన లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతోంది. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష' త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వారం రోజులుగా గంజాయి నిర్మూలనకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు, నిరోధక చర్యలు కొనసాగుతున్నాయని నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ తెలిపారు. గంజాయి వినియోగం, నిల్వ ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం ఉన్న ప్రాంతాలను 'హాట్‌స్పాట్‌లుగా' గుర్తించి శనివారం మంగళగిరి పట్టణంలోని గండాలయపేట ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. డిఎస్పి మురళీకృష్ణ మాట్లాడుతూ తనిఖీల్లో సబ్‌డివిజన్ పరిధిలోని సుమారు 80 మంది పోలీసు సిబ్బంది, సీఐలు, ఎస్‌ఐలు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలను సమగ్రంగా తనిఖీ చేసినట్లు ఆయన చెప్పారు. రికార్డులు లేని, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలతో పాటు చట్ట విరుద్ధంగా తిరుగుతున్న మొత్తం 63 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకువెళ్లవచ్చని ఆయన తెలిపారు. వాహన యజమానుల వివరాలు సేకరించి, గతంలో నేర చరిత్ర ఉన్నారా, రౌడీషీట్లు ఉన్నాయా అనే అంశాలను కూడా పరిశీలించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్‌లో ప్రతి ఒక్కరితో 'గంజాయి వద్దు' అనే సంకల్పం (ప్రతిజ్ఞ) చేయించినట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ, రూరల్ సిఐలు వీరస్వామి, ఏవీ బ్రహ్మం, ఎస్‌ఐలు శ్రీహరి, రవీంద్ర నాయక్, పోలీసు సిబ్బంది, నార్త్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో గల ఎంజిఎస్ ఐటిఐ కళాశాలలో శనివారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. సిఐ నారాయణ స్వామి ఉత్తర్వులను అనుసరించి ఎస్‌ఐ రామకృష్ణ ఉప్పలపాడు ఐటిఐ కళాశాలలో విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే దుష్పరిణామాల గురించి వివరించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా వ్యతిరేకంగా అవగాహన కలిగించి వాటి నిర్మూలన కోసం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ఇర్ఫాన్, శీను నాయక్ కళాశాల యాజమాన్యం సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

డ్రగ్స్ లేని సమాజానికి దారి చూపుదాం అంటూ విద్యార్థులతో పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు 'సంకల్పం' పేరుతో డ్రగ్స్ నియంత్రణపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా శనివారం చినరావూరు ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సులో డిఎస్పి బి జనార్ధన రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులను టార్గెట్ చేసి గంజాయి వంటి మాదకద్రవ్యాలను కొందరు దండగులు విక్రయిస్తున్నారని, అవి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నాయని చెప్పారు. దీనిని అరికట్టేందుకు తొలుత కళాశాల విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం సంకల్పం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని చెప్పారు. తదుపరి మాదకద్రవ్యాల ఆనవాళ్లను పూర్తిగా రూపుమాపేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ షేక్ నయాబ్ రసూల్, కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీహరి

చదువులో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి - మంగళగిరి

చదువుతోపాటు క్రీడలపై విద్యార్థినీ విద్యార్థులు ఆసక్తి చూపాలని, తద్వారా ఆరోగ్యాన్ని మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని మంగళగిరి పట్టణ ఎస్ఐ శ్రీహరి తెలిపారు. స్థానిక డాన్ బాస్కో స్కూల్ ఆవరణలో శనివారం గుంటూరు ఆక్సఫర్డ్ స్కూల్ మంగళగిరి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంగళగిరి పట్టణ సీఐ వీరస్వామి, ఎస్ఐ శ్రీహరి పాల్గొన్నారు. తొలుత శాంతికి చిహ్నమైన పావురాలను ఆకాశంలో ఎగరవేసి క్రీడా జ్యోతి ప్రజ్వలను వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమాన్ని రీజినల్ ఇన్చార్జ్ అమీనా బేగం, ప్రిన్సిపాల్ చైతన్య సారధ్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి డైరెక్టర్, విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'నీరేళ్ళిపోతున్నా నది నాతోనే' కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'నీరేళ్ళిపోతున్నా నది నాతోనే' కవితా సంపుటి ఆవిష్కరిస్తున్నట్లు సభ నిర్వాహకులు యర్రగుంట్ల పాణిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థాపకులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షతన జరిగే సభలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పాల్గని కవితా సంపుటిని ఆవిష్కరిస్తారని, ప్రముఖ సాహితీ విశ్లేషకులు అబ్దుల్ రజా హుసేన్, విమల సాహితీ సమితి (హైదరాబాద్) వ్యవస్థాపకులు డాక్టర్ జెల్ది విద్యాధర్ కవిత్వ విశ్లేషణ చేస్తారని ఆయన తెలిపారు.

వివిఐటియూలో ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉష్ణ నియంత్రణపై సదస్సు

ప్రజాశక్తి - పెదకాకాని




సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్లు

మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గల వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ నందు శనివారం మెకానికల్ మరియు ఈ.సి.ఈ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉష్ణ నియంత్రణపై సదస్సు నిర్వహించారు. వివిఐటి యూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య వక్తగా ఎన్.ఐ.టి వరంగల్ ప్రొఫెసర్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారని తెలిపారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలు సురక్షితంగా, సమర్థవంతంగా ఎక్కువ కాలం పనిచేయటానికి వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే వేడిని నియంత్రించవలసిన అవసరం ఉందని అన్నారు. అధిక ఆపరేటింగ్ వేగం మరియు వోల్టేజీ హెచ్చు తగ్గుల కారణంగా ఎలక్ట్రానిక్ పరికరాలలో వేడి వస్తుందని దానిద్వారా పనితీరు నెమ్మదిస్తుందని, జీవితకాలం తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెలనవీన్, ఈ.సీ.ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.వై.భానుమూర్తి, మెకానికల్ విభాగాధిపతి డా.టి.శ్రీనివాసరావు, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

పేద, బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేసిన ఎన్టీఆర్

ప్రజాశక్తి - తెనాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. అంగలకుదురు గ్రామ టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన చేశారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జెడ్పి చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, మహిళ కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, టిడిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల స్థితిగతులను మార్చేందుకు ఏర్పడిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని, పార్టీ ఆవిర్భావంతోనే పేదల దశ దిశ మార్చేందుకు అనేక సంస్కరణలు తెచ్చిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ పేదవర్గాలకు అన్ని విధాలుగా అండగా ఉండే పార్టీ టిడిపి అని, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు గ్రామ పార్టీ ముందుకు రావడం పై హర్షం వ్యక్తం చేశారు. సభలో జడ్పీ చైర్పర్సన్, రాజకుమారి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు, కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డి.ఎల్.కాంతారావు, హెచ్‌సివి అధినేత కరణం వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కనకాల నాగభూషణం, మాజీ ఎంపీపీ ఎస్.వెంకటరావు, కె.శ్రీనివాసరావు, అలపర్తి సుధాకర్, శ్రీను, అప్పారావు, జిలాని పాల్గొన్నారు




పిల్లి మాణిక్యరావును సన్మానిస్తున్న శరత్

లిడ్ క్యాప్ చైర్మన్‌ను కలిసిన రిటైర్డ్ ఆర్టీసీ అధికారి శరత్ బాబు

ప్రజాశకి - పెదకాకాని

ఆంధ్రప్రదేశ్ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు నూతనంగా తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా రిటైర్డ్ ఆర్టీసీ అధికారి గోకనకొండ శరత్ బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలూరి సుబ్బారావు, పిడిఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ సిద్ధార్థ

రీ సర్వేపై అపోహలు వీడండి : తహశీల్దార్ సిద్ధార్థ

ప్రజాశక్తి - కొల్లిపర

భూ యాజమాన్య హక్కులను కాపాడేందుకు ప్రభుత్వము రీ సర్వే చేపట్టిందని తహశీల్దార్ సిద్ధార్థ అన్నారు. శనివారం మండల పరిధిలోని తూములూరు శివలూరు గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన ర్యాలీలు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తూములూరు గ్రామంలో 1252 ఎకరాల్లో 1328 రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. రీసర్వే సమయంలో రైతులు భూ హక్కు పత్రాలను ఆధార్ కార్డును జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు. ఇప్పటికే మండల పరిధిలో మూడు గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హరికృష్ణ, తూములూరు గ్రామ సర్పంచి బాణావత్ అరుణ బాయి, శివలూరు సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపులోడు క్రమబద్ధీకరణపై రాయితీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణపై రాయితీ కల్పించినట్లు ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ తెనాలి డిఈ అక్కల సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణం, పొన్నూరు పట్టణం, తెనాలి రూరల్, కొల్లిపర, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల గృహ విద్యుత్ వినియోగదారులు ఈ సాధావకాశాన్ని సద్వినియోగపరచుకోవచ్చని సూచించారు. ఈరోజు సాయంత్రం 05:00 గంటల వరకు 50 శాతం రాయితీతో ఒక కిలోవాట్ కేవలం రూ 1250 చొప్పున ఎపిసిపిడిసిఎల్ వెబ్సైట్లో కానీ మీకు సమీపంలో ఉన్న మీసేవ కేంద్రం లేదా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద ఫీజు చెల్లించి రసీదు పొందగలరని తెలిపారు. విద్యుత్ శాఖ తెలిపిన విధంగా అదనపులోడు క్రమబద్ధీకరించుకోవచ్చని లేనియెడల 2026 జనవరి ఫస్ట్ నుంచి ఒక కిలోవాట్ పై అదనంగా వెయ్యి రూపాయలు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

చలపతి కాలేజీలో ఔట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న విశ్వనాధరాజు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో 'ఔట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జెఎన్‌టియు హైదరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విశ్వనాధరాజు పాల్గొని మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020లో పేర్కొన్నట్లు విద్యార్థి కేంద్రీకృత బోధన, లెర్నింగ్ ఔట్‌కం, నిరంతర మెరుగుదల అంశాలు అవుట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్‌తో సహజంగా అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. బోధన-అభ్యసన ప్రక్రియ నాణ్యతను పెంపొందించటంతో విద్యార్థుల సామర్థ్యాలను కొలిచే విధంగా ఓబిఇ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంలో ఒబిఇ తత్వాన్ని సులభంగా అర్థం అయ్యేలా చేయటానికి మన ఆరోగ్యానికి ఇమ్యునిటీ ఎలా లెక్కించబడుతుందో తెలిపారు. అదే విధంగా బోధన విధానాల్లో మార్పులు చేయటం ద్వారా విద్యానాణ్యతను పెంచవచ్చని, డేటా ఆధారిత నిర్ణయాలు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 పేర్కొన్న లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, చలపతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ వై.సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

విజ్ఞాన్స్-ఇండియన్ నావల్ అకాడమీ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లాలోని ప్రతిష్టాత్మక ఇండియన్ నావల్ అకాడమీ (ఐఎన్ఎ) మధ్య అకడమిక్, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా అవగాహన ఒప్పందం కుదిరిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు.ఈ సందర్భంగా డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ నావల్ అకాడమీ ప్రిన్సిపల్ రియర్ అడ్మిరల్ జి.రాంబాబుకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంవి రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇరు సంస్థల మధ్య ఫ్యాకల్టీ మార్పిడి, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ కాన్ఫరెన్సులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అకడమిక్ సమాచార మార్పిడి, పరిశోధనా పబ్లికేషన్లు, అధ్యయన సామగ్రి పరస్పర మార్పిడి ద్వారా జ్ఞాన విస్తరణకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఇండియన్ నావల్ అకాడమీ ఫ్యాకల్టీ సభ్యులు విజ్ఞాన్ యూనివర్సిటీలో తరగతులు, షార్ట్ టర్మ్ ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహించడంతో పాటు, పరిశోధన ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం అందించనున్నారని తెలిపారు. అలాగే విజ్ఞాన్ యూనివర్సిటీ అధ్యాపకులు ఐఎన్ఎలో సెమినార్లు, నాణ్యతాభివృద్ధి కార్యక్రమాలు, శిక్షణ తరగతుల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, చాన్సలర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మలినేనిలో ముగిసిన 36 గంటల హ్యాకాథాన్

ప్రజాశక్తి-గుంటూరు



విజేతలకు బహుమతులు అందచేస్తున్న జ్యూరీ సభ్యులు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిం చిన 'స్మార్ట్ ఐఓటి సిస్టమ్స్‌పై 36 గంటల హ్యాకథాన్' కార్యక్రమం ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో 210 మంది విద్యార్థులు 40 బృందాలుగా 40 వాస్తవ జీవిత సమస్యలకు 36 గంటల నిరంతర శ్రమతో వినూత్నమైన సాంకేతిక పరిష్కారాలను అభివద్ధి చేశారు. జ్యూరీ సభ్యుడు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాలప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశ్రమలు (కార్పొరేట్) ఆశించే నైపుణ్యాలు, సమస్యను అర్థం చేసుకునే విధానం, జట్టు సహకారం క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం వంటి అంశాలపై విపులంగా వివరించారు. కేవలం టెక్నాలజీ పరిజ్ఞానం మాత్రమే కాకుండా, బందంగా పనిచేసే సామర్థ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, బాధ్యతాయుతమైన వైఖరి ఉంటేనే పరిశ్రమల్లో నిలదొక్కుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇతర జ్యూరీ సభ్యులు కూడా తమ అనుభవాల ఆధారంగా విద్యార్థులను ఉద్దేశించి విలువైన సూచనలు అందించారు. మహమ్మద్ యూసఫ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను వాస్తవ అవసరాల ఆధారంగా విశ్లేషించి, వినియోగదారులకు ఉపయోగపడే పరిష్కారాలను రూపొందించాలన్నారు. సాయిశ్యామ్ ఒరుగంటి మాట్లాడుతూ డిజైన్ థింకింగ్, యూజర్ ఎక్స్‌పీరియెన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ, ఒక మంచి ఉత్పత్తి విజయంలో డిజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో పంకజ్ దివాస్, కె.శ్రీనిధిరెడ్డి, మధు వాడ్లమణి ప్రసంగించారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ 3 విజేత బందాలకు బహుమతులు అందజేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పేరుమాళ్లు మాట్లాడుతూ ఇలాంటి హ్యాకథాన్‌లు విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించి, పరిశ్రమలకు సిద్ధంగా మారేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ డి.విజయసారధి ప్రసంగించారు.

గ్రామాల విలీనంపై ఆదరాబాదరా!

వీక్షణం

మరికొద్ది రోజుల్లో జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో అశాస్త్రీయంగా గుంటూరు కార్పొరేషన్‌లో గ్రామాల విలీనంకు కొంత మంది ప్రజా ప్రతినిధుల వత్తిడితో 18 గ్రామాల విలీనం కోసం ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ గుంటూరు నగరపాలక సంస్థ తీర్మానం చేయడం వివాదస్పదం అయింది. గుంటూరు రూరల్ మండలంలో 11, పెదకాకానిలో నాలుగు, వట్టిచెరుకూరు 2, తాడికొండ మండలంలో ఒక్కగ్రామం విలీనంకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూ తీర్మానం చేశారు. వీటిల్లో గుంటూరు రూరల్ మండలంలోని 11 గ్రామ పంచాయతీలు తీర్మానం చేసి జిల్లా పంచాయతీ అధికారికి పంపాయి. జిల్లా పంచాయతీ అధికారి నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు నగరపాలక సంస్థ సుముఖత తెలుపుతూ తీర్మానం చేయాలని ఎమ్మెల్యే రామాంజనేయులు అభ్యర్థన మేరకు తీర్మానం ఆమోదించారు. అయితే దూరంగా ఉన్న గ్రామాలను కలిపి దగ్గర ఉన్న వాటిని వదిలి వేయడాన్ని టిడిపి, వైసిపి సభ్యులు గత సమావేశంలో అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈసారి గుంటూరుకు సమీపంలోని మరో ఆరు గ్రామాలను కలిపారు. అయితే ఈ ఆరు గ్రామాలకు పంచాయతీల నుంచి కనీసం తీర్మానాలు లేవు. అంతేగాక పెదకాకాని మండలంలోని నాలుగు గ్రామాలను విలనీం చేయడాన్ని పొన్నూరు శాసనసభ్యుడు దూళిపాళ్ల నరేంద్ర సుముఖత చూపడం లేదు. కార్పొరేషన్‌లో తీర్మానం చేయాల్సిన నేపథ్యంలో కమిషనర్ పులి శ్రీనివాసులు ధూళిపాళ్లకు ఫోన్ చేసి తక్కెళ్లపాడు, అగవతర్పపాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని పలువురు కార్పొరేటర్లు కోరుతున్నారని చెప్పగా అందుకు ఆయన వ్యతిరేకించారు. వారు కోరడం ఏమిటీ... మేం కలపడం ఏమిటీ అని తిరస్కరించారు. అయినా ఆయన అనుమతి లేకపోయినా నాలుగు గ్రామాలను జత చేశారు. అలాగే వట్టిచెరకూరు మండలంలోని కొర్నెపాడు, పుల్లడిగుంట, తాడికొండ మండలంలోని లాం గ్రామాన్ని విలీనం చేయడానికి ప్రతిపాదనలు తీర్మానం రూపంలో ఆమోదించినా ఆయా గ్రామాలవారికి కనీస సమాచారం తెలియజేయలేదు. రాజధానిలో భూ సమీకరణ కోసం పలుమార్లు సిఆర్‌డిఏ అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామసభలు నిర్వహిస్తుంటే గ్రామాలను నగరపాలక సంస్థలో విలీనంపై గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయసేకరణ చేయాలని వైసిపి సభ్యులు డైమండ్‌బాబు ఈ సందర్భంగా కోరారు. ఇప్పుడు తీర్మానం ఆమోదిస్తే తరువాత గ్రామసభలు పంచాయతీరాజ్‌శాఖ వారు నిర్వహిస్తారని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. అలాగే ఈనెల 12న జరిగిన నగరపాలక సంస్థ అత్యవసర సమావేశంలో 11 గ్రామాల్లో మొత్తం జనాభా 35,409 మంది ఉన్నట్టు ఏజెండాలో పేర్కొన్నారు. శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 60 వేల మంది జనాబా ఉన్నట్టు ఎమ్మెల్యే రామాంజనేయులు, అధికారులు చెప్పడం గమనార్హం. 15 రోజుల వ్యవధిలో రెట్టింపు జనాభా ఎలా చూపించగలిగారన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. అలాగే 11 గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూమి 12,601 ఎకరాలుగా చూపారు. మొత్తం 13 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంకు ఉందని, దీనిని కార్పొరేషన్ వినియోగించుకోవచ్చునని చెప్పుకొచ్చారు. అలాగే 11 గ్రామాల్లో ఆదాయం రూ.7.42 లక్షల కోట్లుగా ఉంది. సాగు భూములు మొత్తం వ్యవసాయేతర రంగాలకు మళ్లించేందుకు వేసిన ముందస్తు ప్రణాళికలోనే ఈగ్రామాల విలీనం ప్రక్రియ చేపట్టారనే వాదన విన్పిస్తోంది. కొసమెరుపు ఏమిటంటే విజయవాడ, తిరుపతి కార్పొరేషన్లలను కూడా గ్రేటర్‌గా మార్చాలన్న ప్రతిపాదనలపై సిఎం చంద్రబాబు నివాసంలో శనివారం సమీక్ష జరిగింది. 2011 జనాభా లెక్కల విలీనం ప్రతిపాదనలు సరికాదని, వచ్చే నెలలో జన గణన ప్రారంభం కానుందున విలీన ప్రతిపాదనలు వాయిదా వేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దీంతో సిఎం వద్ద జరగాల్సిన గ్రేటర్ కార్పొరేషన్ల ప్రతిపాదనలు వాయిదా పడ్డాయి. కానీ గుంటూరులో మాత్రం 2011 జనాభా ప్రాతిపదికన విలీనంకు ఆదారబాదరగా ప్రతిపాదనలను ఆమోదించడం గమనార్హం. అలాగే గ్రామాలుగా కొనసాగితే తమకు ఎన్నో పదవులు వస్తాయని గతంలో 10 పెద్ద గ్రామాలు కలిపితే ఐదు కార్పొరేటర్లు వచ్చారని వారిని తాము కలవలేకపోతున్నామని ఆయా గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మరో వైపు రాజకీయంగా కూడా గ్రామ పంచాయతీలు కొనసాగితే ఎన్నో పదవులు వస్తాయని సర్పంచ్‌కే చెక్ పవర్ ఉంటుందని ఆయా గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపిటిసిలు, ఇతర రాజకీయ, అధికార పదవులు ఎన్నో వస్తాయని గుర్తు చేస్తున్నారు.

(ఎ.వి.డి.శర్మ)

ఆర్‌విఆర్ అండ్ జెసిలో ఉత్సాహంగా కొలరిడో

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'కొలరిడో-2025' నేషనల్ ఫెస్ట్ ఉత్సాహభరితంగా శనివారం నాడు ఘనంగా ముగిసింది. దేశ నలుమూలల నుంచి వచ్చిన సుమారు 25 వేల మంది విద్యార్థులతో కళాశాల ప్రాంగణం రెండు రోజుల పాటు పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల నత్యాలు, పాటలు, నాటికలు ప్రేక్షకులను అలరించాయి. టెక్నికల్ విభాగంలో వినూత్న ఆలోచనలు, సజనాత్మక ఇన్నోవేషన్‌లతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కోడింగ్ ఛాలెంజ్‌లు, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్లలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడా విభాగంలో మైదానాల్లో ఉత్కంఠభరితంగా సాగిన క్రీడాపోటీలు రసవత్తరంగా సాగాయి. మెహెందీ, చిత్రలేఖనం, రంగోలి వంటి కార్యక్రమాలు రంగుల సంబరాన్ని నింపాయి. ఫెస్ట్‌లో పాల్గొన్న తెలుగు సినీ తారలతో వేదిక సందడిగా మారింది. ప్రముఖ హాస్యనటుడు షకలక శంకర్ అందించిన స్క్రిప్ట్ ప్రేక్షకుల్లో నవ్వుల జల్లు కురిపించింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను న్యాయనిర్ణేతలు కేటాయించారు. అతిథుల చేతుల మీదుగా మొత్తం రూ.5 లక్షల విలువైన నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. యువతలోని సజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. తరగతి గదిలోని విద్యతో పాటు ఇలాంటి జాతీయస్థాయి ఉత్సవాలు నాయకత్వ లక్షణాలు, ప్రాంతీయ కలయిక, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు.విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలతో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు కొత్త అనుభూతిని కలిగించడమే కాకుండా, తోటి విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ ఇంచార్జి కన్వీనర్ రంగరాయచౌదరి పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు



ప్రయోగాల్లో పాల్గొన్న విద్యార్థులతో సాంబశివరావు, చంద్రశేఖర్‌రెడ్డి

సుమేధా హైస్కూల్లో భౌతిక శాస్త్ర ప్రయోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, సుగుణ సైన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ చివుకుల సాంబశివరావు 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల ఆధారితంగా ప్రయోగాల కార్యశాల నిర్వహించారు. ఇందులో సింపుల్ సర్క్యూట్, సిరీస్ అండ్ పార్లర్ కనెక్షన్, ఎలక్ట్రిసిటీ పాస్ త్రూ లిక్విడ్, వాటర్ అలారం, పోస్కల్ ప్రిన్సిపల్ ఆధారితంగా హైడ్రాలిక్ జాక్‌ను విద్యార్థులు సొంతగా తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌ల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటాలి

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించిన స్టేట్ లెవెల్ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని, సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక అయిన చేబ్రోలు మండలం, కొత్త రెడ్డిపాలెం సి.కె హైస్కూల్ విద్యార్థులు జి.చందుసాయి, ఎస్.విజయ్, గైడ్ టీచర్ శివశంకరరెడ్డిని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీంభాషా అభినందించారు. ఈ సందర్భంగా డిఇఒ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ 'స్మార్ట్ డస్ట్ బిన్' గురించి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాజెక్టును మరింత మెరుగుపరచుకొని సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో కూడా చక్కటి ప్రతిభ కనబరచాలని జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గౌసుల్‌మీరా, ఏసీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సదరన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ